సాక్షి ఒడిశా



1

గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

పురిటిగూడలో పత్రికొమ్మల పండుగ



పురిటిగూడ గ్రామంలో పత్రికొమ్మల పండుగలో రైతులు

పర్లాకిమిడి: కాశీనగర్ సమతి పురిటిగూడ గ్రామంలో దసరా వేడుకలు సందర్భంగా రైతులు పత్రికొమ్మల పండుగను బుధవారం జరుపుకున్నారు. పత్రికొమ్మలను అమ్మవారి మందిరానికి తీసుకువచ్చి అక్కడ కోళ్లు, మేక పోతులను బలిచ్చి ఆ రక్తాన్ని పత్రికొమ్మలకు తడుపుతారు. దీనిని పత్రికొమ్మల దసరా అని పిలుస్తారు. ఆ కొమ్మలను పంటపొలాల్లో నాటుతారు. ఆకులకు ఉన్న రక్తంతో పొలంలో కీటకాలు నాశనం అవుతాయని, పంటలు బాగా పండుతయని అన్నదాతల విశ్వాసం. పత్రికొమ్మల దసరా వేడుకల్లో బీజేపీ నాయకులు రోక్కం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు వందల కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో ఉన్న బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ పంచాయతీ పర్కన్‌మాల అటవీప్రాంతంలో అక్రమ రవాణాకు సిద్ధం చేసిన గంజాయిని మంగళవారం రాత్రి బలిమెల పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అడవిలో ఉన్న గంజాయి గురించి బలిమెల ఐఐసీ దీరాజ్ పట్నాయక్‌కు విశ్వాసనీయ వర్గాల నుంచి ఫోన్ సమాచారం వచ్చింది. దీంతో తన సిబ్బందితో మంగళవారం రాత్రి అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల రాకను గమనించిన గంజాయి ముఠా పరారైంది. ఓ చోట ఉన్న 20 బస్తాలను స్వాధీనం చేసుకొని పరిశీలించగా వాటిలో భారీగా గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వీటిని పోలీస్ స్టేషన్ తరలించారు. బుధవారం ఉదయం తూకం వేయగా 500 కిలోలు ఉందని.. దీని విలువ సుమారు 30 లక్షల రూపాయలు ఉంటుందని ఐఐసీ దీరాజ్ పట్నాయక్ తెలిపారు. కేసు నమోదు చేసి గంజాయి అక్రమ రవాణాలో పాత్రదారులను గుర్తిస్తామన్నారు.

కారు దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు



స్వాధీనం చేసుకున్న కారు, అరెస్టయిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుడారి పోలీసులు మంగళవారం కారు దొంగతనం కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కారును సైతం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 22వ తేదీన గుడారి పోలీస్ స్టేషన్ పరిధిలోని టుబుని గ్రామానికి చెందిన జష్య పాలక అనే వ్యక్తి తన సొంత కారును టుబుని ఆస్పత్రి సమీపంలో పార్కింగ్ చేసి విశాఖపట్నం వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వచ్చి చూడగా కారు కనిపించకపోవడంతో చోరీ జరిగి ఉంటుందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి మంగళవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి గుణుపూర్ కోర్టుకు తరలించారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా సోలిన్ సాకర్ జట్టు



షీల్డ్ ప్రదానం చేస్తున్న అంతర్జాతీయ అథ్లెట్ కిషోర్‌చంద్రరథ్

పర్లాకిమిడి: గజపతి స్టేడియంలో సెప్టెంబర్ 28 నుంచి జరుగుతున్న జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా సోలిన్ సాకర్ జట్టు నిలిచింది. ఫైనల్ పోరులో బ్లూ టైటాన్ జట్టుపై విజయం సాధించింది. అంతర్జాతీయ క్రీడాకారుడు కిషోర్‌చంద్ర రథ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను ఆదిత్యకార్జి, పవన్ పట్నాయిక్, ఆదిత్య బెహరా పర్యవేక్షించారు.

బొమ్మల కొలువు.. సంప్రదాయాలకు నెలవు



కటక్‌లోని మధుపట్న అరవిందనగర్‌లో సీహెచ్ కుసుమ నివాసంలో బొమ్మల కొలువు



భువనేశ్వర్ పటియా ఆర్యపల్లిలో భానుమతి ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



కటక్ కల్యాణి నగర్‌లో వి.రాజేశ్వరి నివాసంలో బొమ్మల కొలువు

దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బొమ్మల కొలువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తూ దశాబ్దాలుగా నేటికీ అనేక ఇళ్లల్లో భక్తులు పలు రకాల బొమ్మల్ని సందేశాత్మకంగా కొలువుదీర్చుతున్నారు. వివిధ రకాల బొమ్మతో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నారు. బొమ్మల నడుమ కొలువుదీరిన దుర్గా మాతకు నిత్యం ఆరాధించి పలు రకాల నైవేద్యాలు సమర్పిస్తున్నారు. కొలువు సందర్శనకు విచ్చేసే ముత్తయిదువలకు తాంబూలం సమర్పించి శుభం కలగాలని దేవిని వేడుకుంటున్నారు. కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో తెలుగింటి బొమ్మల కొలువు దసరా సంబరాల్ని ద్విగుణీకృతం చేస్తోంది. ఈ ఏడాది కటక్ నగరంలో వి.రాజేశ్వరి, సీహెచ్ కుసుమ భువనేశ్వర్‌లో భానుమతి బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. విజయ దశమితో వీరు ఏర్పాటు చేసిన కొలువుని ముగిస్తారు. వీరంతా పూర్వీకుల నుంచి అలవరచుకున్న ఆచారం ప్రకారం ఏటా క్రమం తప్పకుండా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తుండడం విశేషం. మిగిలిన ప్రాంతాల్లోనూ బొమ్మల కొలువులతో సందడి నెలకొంది.

– భువనేశ్వర్

ఎస్‌ఐ పరీక్షల్లో కలకలం

- పరీక్షలకు ముందే అభ్యర్థులకు ప్రశ్నపత్రాలు ఇచ్చేలా ఒప్పందం
- పక్కా సమాచారంతో పట్టుకున్న పోలీసులు
- రాతపరీక్షను వాయిదా వేసిన ఓపీఆర్‌బీ

భువనేశ్వర్: ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో రాష్ట్రంలో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నియామకాలకు సంబంధించిన రాత పరీక్ష వాయిదా వేసినట్లు ఒడిశా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఓపీఆర్‌బీ) బుధవారం ప్రకటించింది. అక్రమాలు నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు క్రైం శాఖ దర్యాప్తు చేయాలని యోచిస్తుండగా.. సీబీఐ దర్యాప్తు చేపట్టాలని విపక్ష బిజూ జనతా దళ్ గళం డిమాండ్ చేస్తోంది.

15 నెలల్లో 15 నియామక పరీక్షలు రద్దు..

ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలు రద్దు చేయడంలో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించిందని విపక్ష బిజూ జనతా దళ్ ఎద్దేవా చేసింది. తాజాగా పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ రాత పరీక్ష రద్దు ప్రకటనతో షాక్ అయినట్లు విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విచారం వ్యక్తం చేశారు. తెర వెనుక పరీక్షను నిర్వహిస్తున్న సంస్థ మోసానికి పాల్పడినట్లు బీజేడీ అనుమానం వ్యక్తం చేసింది. ఉద్యోగాల నియామకంలో స్వచ్ఛమైన, అవినీతి రహిత పారదర్శక నియామక వ్యవస్థ పునరుద్ధరించకుంటే బిజూ విద్యార్థి జనతా దళ్ ఉద్యమం చేస్తుందని హెచ్చరించింది. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఈ కుంభకోణంలో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారాయని ఆరోపించింది. ఈ దుశ్చర్య వెనుక అగ్రస్థాయి ప్రముఖుల హస్తం ఉందని బిజూ యువ జనతా దళ్ అధ్యక్షుడు ఆరోపించారు.

● ఈ కుంభకోణంలో ఇప్పటి వరకు 117 మంది నిందితుల్ని అరెస్టు చేశారు. రహస్య సమాచారం ఆధారంగా పోలీసులు ఈ కుంభకోణాన్ని గుట్టురట్టు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దు సమీపం గంజాం జిల్లా గొలంతర ప్రాంతంలో 3 ఎయిర్ కండిషన్ స్లీపర్ బస్సులను బరంపురం పోలీసులు అడ్డుకుని ముఠాని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు మధ్యవర్తులు (ఏజెంట్లు, దళారులు) ఆధ్వర్యంలో ఈ బస్సులు భువనేశ్వర్, బరముండా నుంచి పలువురు అభ్యర్థులను విజయనగరానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. విజయనగరంలో అభ్యర్థులకు రాత పరీక్ష ప్రశ్నపత్రం అందజేసి వీరందర్ని గుట్టుగా భువనేశ్వర్‌కు చేర్చేందుకు వ్యూహం పన్నారని తెలిసింది.

రెండు విడతల్లో రూ.25 లక్షలు..

ఒడిశా పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) ఉద్యోగం పొందేందుకు ఒక్కో అభ్యర్థి రెండు విడతల్లో రూ. 25 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. రాత పరీక్షకు ముందు ప్రశ్నపత్రం పొందడంతో తొలి విడత రూ. 10 లక్షలు, తర్వాత తుది ఫలితాలు వెలువడి పని పూర్తి అయితే రెండో విడత కింద మిగిలిన రూ. 15 లక్షలు చెల్లించాలని నిర్ణయించుకున్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), ఒడిశా పబ్లిక్ ఎగ్జామినేషన్ (అక్రమ మార్గాల నివారణ) చట్టం, 2024లోని వివిధ సెక్షన్ల కింద గొలంతర స్టేషన్‌లో పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. 117 మంది నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న ఇతరులను గుర్తించి అరెస్టు చేయడానికి తదుపరి దర్యాప్తు నిరవధికంగా కొనసాగిస్తున్నారు.

● ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 20 లక్షల నుండి రూ.25 లక్షల వరకు లంచం లావాదేవీలు ఒప్పందం కుదిరిందని ప్రాథమిక దర్యాప్తులో తేలడంతో క్రైమ్ శాఖ మరింత లోతుగా దర్యాప్తు చేస్తుందని సమాచారం. ఈ సంఘటనలో ఇప్పటి వరకు అరెస్టు చేసిన నిందితుల్ని బరంపురం పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. రాత్రంతా క్రైమ్ శాఖ, బరంపురం పోలీసులు విచారించిన తర్వాత వారిని అరెస్టు చేశారు. ఈ మోసం సంఘటన వెలుగులోకి రావడంతో ఒడిశా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ పరీక్షను నిలిపివేసింది.

పిడుగుపాటుకు పశువుల మృతి



మృతి చెందిన పశువు

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి పరిధిలో రుపుజి గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై ఐదు పశువులు మృత్యువాతపడ్డాయి. భీమ మండంగి, గుబేయ పలకలకు చెందిన పశువులు మేతకు వెళ్లిన సమయంలో ఈ దుర్ఘటన చేసుకుంది. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన ఇప్పిలి గౌరి

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. కేఎన్‌కే సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు కంద్రవీధికి చెందిన ఇప్పిలి గౌరిగా గుర్తించారు. ఇంకా కేసు నమోదు కాలేదు.

ప్రిన్సిపాల్ జితేంద్రనాథ్‌కు ఘనంగా వీడ్కోలు



జితేంద్రనాథ్ పట్నాయక్‌కు వీడ్కోలు తెలుపుతున్న అధ్యాపకులు



కేక్‌ను కోస్తున్న ప్రిన్సిపాల్ జితేంద్రనాథ్ పట్నాయక్

పర్లాకిమిడి: స్థానిక శ్రీక్రిష్ణచంద్రగజపతి స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జితేంద్రనాథ్ పట్నాయక్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రొఫెసర్లు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు తెలిపారు. గత అయిదేళ్లలో కళాశాలలో అనేక విభాగాల్లో పోస్టుల భర్తీకి బరంపురం విశ్వ విద్యాలయానిక సిఫారసు చేశారు. అంతేకాక పలువురుకి కాంట్రాక్టు పద్ధతిలో లెక్చరర్లను నియమించేందుకు పట్నాయక్ విశేషంగా కృషి చేశారు. పచ్చదనం కోసం కళాశాల ఆవరణలో అనేక మొక్కలను నాటించారు. ఆయనకు కన్వీనరు రధాకాంత భుయ్యాన్, డాక్టర్ ఎం.రహమాన్ తదితరులు కేక్‌ను కోసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వృద్ధులను ఆదరించాలి



మాట్లాడుతున్న కార్యదర్శి సుబ్బలక్ష్మి

జయపురం: వృద్ధులను భారంగా భావించకుండా ప్రేమగా ఆదరించాలని వక్తలు పేర్కొన్నారు. కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ ఆధ్వర్యంలో జయపురం సమితి బలియ పంచాయతీ బిశాయిపుట్‌లో బుధవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. వృద్ధులకు సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి ఎస్.సుబ్బలక్ష్మి, రిజిస్ట్రార్ బిష్ణు ప్రసాద్ దేవత, సబ్ డివిజనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సంతోష్ కుమార్ బారిక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాపూజలో అపశ్రుతి..


- కటక్‌లో భారీ వర్షం
- పందిరి కూలి ముగ్గురికి గాయాలు



కాలేజ్ స్క్వేర్ వద్ద కుప్పకూలిన దుర్గాపూజా తోరణం

భువనేశ్వర్: దుర్గాపూజలకు ప్రసిద్ధి చెందిన కటక్‌నగరంలో భారీ వర్షాలు దసరా ఉత్సవాలను దెబ్బతీశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా రెండు చోట్ల ప్రమాదాలు జరిగాయి. కాలేజ్ స్క్వేర్, రాజా బగిచా ప్రాంతాల్లో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రమాదం సమయంలో కాలేజ్ స్క్వేర్ ప్రాంతంలో ఎవరూ గాయపడలేదు. రాజా బగిచాలో పూజలు జరుగుతుండగా ప్రమాదం సంబంవించింది. పూజా మండపం పైకప్పు కూలడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం సమీపంలోని వైద్య కేంద్రంలో చేర్చారు. భారీ వర్షం కారణంగా కటక్ నగరంలో పలుచోట్ల విద్యుత్తు సరఫరా, తాగునీటి పంపిణీకి అంతరాయం ఏర్పడింది.

అదరహో..!



రాత్రిపూట దేవభూమి క్షేత్రం ఇలా..



వీఎస్‌ఎస్ నగర్‌లో రూపుదిద్దుకున్న జగన్నాథుని నందిఘోష్ రథం నమూనా తోరణం



రసూల్‌ఘడ్ ప్రాంతంలో ఉత్తరాఖండ్ దేవభూమి క్షేత్రం



వీఎస్‌ఎస్ నగర్ పూజా మండపంలో పూజలందుకుంటున్న ఉత్సవ మాత

భువనేశ్వర్ నగరంలో ఎక్కడిక్కడ అబ్బురపరిచే పూజా మంటపాలు సందర్శకుల్ని కట్టిపడేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక, ధార్మిక, పుణ్య క్షేత్రాల్ని ప్రతిబింబించేలా నిలువెత్తు తోరణాలు ఆకట్టుకుంటున్నాయి. స్థానిక వీఎస్‌ఎస్ నగర్ దుర్గా పూజ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం జగన్నాథుని రథం నందిఘోష్ నమూనాతో దుర్గా పూజా తోరణం తీర్చిదిద్దారు. రసూల్‌ఘడ్ ప్రాంతంలో ఉత్తరాఖండ్ దేవ భూమి క్షేత్రం రూపొందించారు. వీటిని తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం తరలివస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నగర పోలీసు కమిషనరేటు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

– భువనేశ్వర్

క్లుప్తంగా

నేడు జగన్నాథుడి స్వర్ణాలంకార దర్శనం


స్వర్ణాలంకరణలో జగన్నాథుడు

భువనేశ్వర్ : పూరీలో జగన్నాథుడు విజయదశమి సందర్భంగా గురువారం స్వర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామి కొలువు దీరిన శ్రీ మందిరం రత్న వేదికపై ప్రత్యేక సందర్భాల్లో దేవతా త్రయం బంగారు అలంకరణలో దర్శనం కల్పిస్తారు. ఈ నేపథ్యంలో అశ్విని శుక్ల పక్ష దశమి తిథి దసరా సందర్భంగా జగన్నాథుడు బంగారు శోభతో రాజ రాజేశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిస్తాడు. నిత్య దైనందిన ప్రాథమిక ఉపచారాలు ముగిసిన తర్వాత జగన్నాథుడు, సోదరి దేవీ సుభద్రని బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు.

వ్యక్తిపై దాడి

సారవకోట : కిడిమి పంచాయతీ బుడ్డయ్యపేటకు చెందిన పిల్లా పున్నయ్యపై జమచక్రం గ్రామానికి చెందిన మెండ ఆదినారాయణ దాడికి పాల్పడ్డాడు. మంగళవారం మేకల మేత విషయంలో జరిగిన తగాదాలో ఆదినారాయణ తనపై దాడి చేసి గాయపర్చినట్లు పున్నయ్య బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ కృష్ణారావు కేసు నమోదు చేశారు. బాధితుడు ప్రస్తుతం జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల : ఉన్నత విద్యా మండలి సూచనల మేరకు 2025 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 3, 4 తేదీల్లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ బి.అడ్డయ్య బుధవారం తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: జీఎస్టీ తగ్గింపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీఎస్టీ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న రెండు రోజుల్లో పరిశ్రమలు, వాణిజ్య పన్నులు, విద్యుత్, చేనేత శాఖల అధికారులు జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జీఎస్టీ నోడల్ అధికారి స్వప్నదేవి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు వర్సిటీ విద్యార్థులు

ఎచ్చెర్ల : కర్ణాటకలోని బెల్గామి వద్ద రాణీ చిన్నమ్మ వర్సిటీలో ఈ నెల 4 నుంచి 7 వరకు జరగనున్న సౌత్ జోన్ అంతర్ వర్సిటీ పురుషుల కబడ్డీ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక బీఆర్‌ఏయూ జట్టు బుధవారం పయమయ్యింది. జట్టుకు కోచ్‌గా ఎం.గణేష్ వ్యవహరించనున్నారు. పోటీల్లో రాణించి విజయం సాధించాలని వ్యాయామ విభాగ అధ్యాపకులు శ్రీనివాసరావు, భాస్కరరావు ఆకాంక్షించారు.

మెట్ల పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

జలుమూరు: తలతరియా పంచాయతీకి చెందిన దండుపాటి గడ్డయ్య(55) ఇంటి మెట్ల పైనుంచి జారిపడి బుధవారం మృతి చెందాడు. గడ్డయ్య గత నెల 16న ఇంటి నుంచి డాబాపైకి మెట్లు ఎక్కుతూ జారిపడ్డాడు. తల, శరీర భాగాలకు గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు మృతుడి సోదరుడు అప్పయ్య తెలిపారు. గడ్డయ్యకు భార్య యశోద, కుమారుడు రామన్న ఉన్నారు. అప్పయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.అశోక్‌బాబు తెలిపారు.

జీసీడీఓగా మాధవి

శ్రీకాకుళం : జిల్లా సమగ్ర శిక్షలో సెక్టోరియల్ పోస్టుల్లో ఒకటైన జీసీడీఓగా చదువుల మాధవి నియమితులయ్యారు. మంగళవారం ఉత్తర్వులు వెలువడగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈమె సారవకోట మండలం పిడిమి ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. ఈమె భర్త జల్లేపల్లి శ్రీనివాసరావు గతంలో సమగ్ర శిక్షలో ఏఎస్‌ఓగా పనిచేశారు. జీసీడీఓ పోస్టు ఆరు నెలలుగా ఖాళీగా ఉంది. కాగా, కొద్దిరోజుల కిందట అసిస్టెంట్ జీసీడీఓగా కాకినాడకు చెందిన రమాదేవిని నియమించారు. జిల్లాల పునర్విభజనలో ఈ పోస్టు పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయింది. లేనిపోస్టులో రమాదేవిని నియమించడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తాజాగా జీసీడీఓ నియామకం పూర్తయిన నేపథ్యంలో అసిస్టెంట్ జీసీడీఓని కొనసాగిస్తారా ఆమెను వెనక్కు పంపిస్తారా అనేది వేచి చూడాల్సిందే.

మహిషాసురమర్దినిగా..

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, మండపాల్లో భక్తులు కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– సాక్షి నెట్‌వర్క్


పర్లాకిమిడి: చిత్రకారవీధి జంక్షన్ వద్ద మహిషాసురమర్దిని అవతారంలో..


పర్లాకిమిడి: మార్కెట్ వద్ద ప్రజా ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద మహిషాసురమర్దిని అవతారం


మల్కన్‌గిరి: చిన్నారులకు కన్య పూజ చేస్తున్న భక్తులు


పర్లాకిమిడి: రాజగురువీధిలో దేవీనవరాత్రులు సందర్భంగా..


మల్కన్‌గిరి: డీఎన్‌కే కూడలి వద్ద మా దూర్గదేవి


మల్కన్‌గిరి: డైలీ మార్కెట్ వద్ద భక్తులకు దర్శనం ఇస్తున్న మా దూర్గాదేవి


మల్కన్‌గిరి: పోలీసు గ్రౌండ్ వద్ద అమ్మావారు


మల్కన్‌గిరి: మల్కన్‌గిరి నగరం విద్యుత్ దీపాల అలంకరణ


మల్కన్‌గిరి: కలిమెలలో మా దూర్గాదేవి


రాయగడ: మొక్కల ఆవశ్యకత గురించి వివరించే ప్రదర్శన


రాయగడ: ఛత్రపతి శివాజీ


రాయగడ: వేంకటేశ్వర స్వామి


రాయగడ: దుర్గమ్మతల్లి


రాయగడ: దేవతలు


రాయగడ: భూతాలు


మల్కన్‌గిరి: దూర్గాదేవి మందిరంలో ప్రత్యేక పూజాలు అందుకుంటున్న దూర్గదేవి


జయపురం: సూర్యమహల్ ప్రాంగణంలో విజయ దశమి ఉత్సవాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ మనోరంజన్ ప్రధాన్


రాయగడ: టికిరిలో కొలువదీరిన దుర్గమ్మతల్లి

సీహెచ్‌సీలు కిటకిట

కొత్తూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు సమ్మెకు దిగడంతో పేద, సామాన్య రోగులు సీహెచ్‌సీల బాటపడుతున్నారు. కొత్తూరు మండలంలో కురిగాం, మెట్టూరు పీహెచ్‌సీలు ఉన్నాయి. వైద్యులు సమ్మెలో ఉన్నందున పీహెచ్‌సీలకు వెళ్లవలసిన రోగులు కొత్తూరు సీహెచ్‌సీకి బుధవారం ఎక్కువ మంది వైద్యం కోసం తరలివచ్చారు.


కొత్తూరు సీహెచ్‌సీ ఆవరణలో రోగులు

కార్మికులపై కక్ష సాధింపు తగదు

రణస్థలం: యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో 22 ఎళ్లుగా పని చేస్తున్న కార్మికులను వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే నెపంతో తొలగించడం అన్యాయమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సుమారు 50మంది కార్మికులను తొలగించడం దారుణమన్నారు. ఈ విషయమై యూబీ పరిశ్రమ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే కొద్ది రోజుల్లోనే తిరిగి వేస్తామని చెప్పి నేటికి ఏడాదిన్నర అయినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీజేపీ సానుభూతిపరులైన కార్మికులు మద్యం తాగినా, పరిశ్రమలో గొడవలు సృష్టించినా ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. భూగర్భ జలవరుల శాఖ అధికారుల అనుమతులు లేకుండా 500 అడుగుల లోతున 3 అడుగుల వెడల్పున బోర్లు వేసి జలాలు ఎలా తోడేస్తున్నారని, పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని చెప్పారు. కలుషిత వ్యర్థ జలాలు రణస్థలం పంచాయతీలోని సీతంపేట చెరువులోనికి, బంటుపల్లి జగనన్న కాలనీ వైపు వదిలేస్తుండటంతో పంటలకు నష్టం కలుగుతోందన్నారు. పరిశ్రమ నుంచి వెలువడే బూడిద వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించకపోతే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, రాష్ట్ర అనుబంధ విభాగం జాయింట్ సెక్రటరీ కెల్ల రామకృష్ణ, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు దన్నాన హరి, బంటుపల్లి మాజీ సర్పంచ్ పాశపు ముకుందరావు, కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

చోరీ సొత్తు స్వాధీనం

- హిజ్రా అరెస్టు

కంచిలి/పలాస: మండల కేంద్రం కంచిలిలో ఈ ఏడాది జూలై 5న రిటైర్డు లెక్చరర్ పురెళ్ల సింహాద్రి ప్రధాన్ ఇంట్లో జరిగిన చోరీ కేసుకు సంబంధించి కొంత సొత్తును రికవరీ చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ డి.లక్ష్మణరావు తెలిపారు. 25 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి ఆభరణాలు చోరీకి గురికాగా 12 తులాల ముప్పావు బంగారు ఆభరణాలు, 55.88 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. చోరీ కేసులో ఐదుగురు నిందితుల్లో ఒకరైన కంచిలిలో రైల్వేస్టేషన్ వెనుకవైపు నివాసం ఉంటున్న కవిటి మండలం కవిటి పట్టణం కండ్రవీధికి చెందిన నాగుల సోనియా అనే హిజ్రా బుధవారం ఉదయం 11 గంటలకు సోంపేట వైపు నుంచి కంచిలి రైల్వేస్టేషన్ వైపు చేతిలో కవర్ పట్టుకొని వస్తోంది. పోలీసులను చూసి పారిపోతుండగా సోంపేట సీఐ బి.మంగరాజు సిబ్బంది సాయంతో పట్టుకున్నారు. ఈ క్రమంలో జూలై 5న రాత్రి బూరలు అమ్ముకొనే బాబు(భోపాల్, మధ్యప్రదేశ్), కబాడియా(ఔరంగాబాద్, మహారాష్ట్ర), సనాటా(కోట, రాజస్థాన్), టున్ని అనే నలుగురు వ్యక్తులతో కలిసి కంచిలిలోని సింహాద్రి ప్రధాన్ ఇంట్లో దొంగతనం చేసినట్లు అంగీకరించింది. ఆమె వద్ద 105.53 గ్రాములు బంగారు, డైమండ్ లాంగ్ నెక్లెస్(హారం), 41.57 గ్రాముల మామిడి పిందెల బంగారు చైన్, 3.88 గ్రాముల చెవి రింగులు, 55.88గ్రాముల వెండి గిన్నెలు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సోంపేట సీఐతో పాటు కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు, సిబ్బంది ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ డి.లక్ష్మణరావు, సోంపేట సీఐ మంగరాజు

శాసనసభలో అవగాహనతో మాట్లాడాలి

సారవకోట: శాసనసభలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అవగాహన లేకుండా మాట్లాడారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. బుధవారం సారవకోటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఉన్న నకిలీ బెంతు ఒరియాలని చెప్పుకుంటున్న వారు బీసీ–ఏకి చెందిన వడ్డి కులస్తులని, వారి కోసం గతంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిశోధన సంస్థ అధ్యయనం చేసి అప్పటి ప్రభుత్వానికి నివేదిక అందజేసిందని తెలిపారు. అది తెలుసుకోకుండా శాసనసభలో అవగాహన రాహిత్యంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికొదిలేసి ఓట్లు కోసం నకిలీ బెంతు ఒరియాల కోసం శాసనసభలో మాట్లాడటం విచారకరమన్నారు. జిల్లాలో ఆదివాసీలకు అవసరమైన ఐటీడీఏ లేదని, నకిలీ గిరిజన ధ్రువపత్రాలతో సుమారు వెయ్యి మంది శ్రీకాకుళం జిల్లాలో ఉద్యోగాలు చేస్తున్నారని, వారిపై శాసనసభలో మాట్లాడం లేదన్నారు. ఆయనతో పాటు ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు జన్ని దాలయ్య, బొమ్మాళి కృష్ణ, బాలరాజు, నాగయ్య, రంగారావు తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వాబ యోగి

ఒకటే గమనం.. ఒకటే గమ్యం!

- నర్సీపట్నంలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలు
- కఠోర సాధన చేస్తున్న క్రీడాకారులు
- ఇప్పిలి, కేశవరావుపేట వేదికగా రెసిడెన్షియల్ శిక్షణా శిబిరాలు


కేశవరావుపేటలో సాఫ్ట్‌బాల్ సాధన చేస్తున్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సాఫ్ట్‌బాల్ గేమ్‌లో పతకమే లక్ష్యంగా బాలబాలికలు కఠోర సాధన పూర్తి చేశారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో సత్తాచాటేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, యూత్, సీనియర్స్ ఇలా అన్ని విభాగాల్లోను హాట్ ఫేవరేట్‌గా బరిలో దిగుతున్నారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారుల అభ్యర్థనను, దసరా సెలవులను పరిగణనలోకి తీసుకున్న జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘ పెద్దలు శ్రీకాకుళం రూరల్ మండలం, ఇప్పిలి జెడ్పీహెచ్‌స్కూల్ వేదికగా బాలికలకు, ఎచ్చెర్ల మండలం, కేశవరావుపేట జెడ్పీహెచ్‌స్కూల్ వేదికగా బాలురుకు శిక్షణా శిబిరాలను నిర్వహించారు. టైటిల్ సాధనే లక్ష్యంగా క్రీడాకారులకు గేమ్‌లో మెలకువలు అందిస్తు తీర్చిదిద్దారు. గేమ్‌తోపాటు ఫిట్‌నెస్‌పై కూడా దృష్టిసారిస్తున్నారు. సంఘ పెద్దలు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.


నెట్స్ వద్ద కఠోర సాధన చేస్తున్న క్రీడాకారిణి

మెలకువలు నేర్చుకున్నాం..

మాణిక్యపురం జెడ్పీహెచ్ స్కూల్‌లో టెన్త్‌క్లాస్ చదువుతున్నాను. జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రపోటీల్లో పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. శిక్షణా శిబిరాల్లో మెలకువలు నేర్చుకుంటున్నాం.

– సాహు కాళిదాస్, సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు



సన్నద్ధం చేస్తున్నాం..

క్రీడాకారులకు మంచి భవిష్యత్తును ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతోనే రాత్రింబవళ్లు కష్టపడుతున్నాం. సంఘ పెద్దల ప్రోత్సాహంతో సొంత ఖర్చులు పెట్టుకుని, రెసిడెన్షియల్ క్యాంప్‌లు నిర్వహించి పోటీలకు సన్నద్ధం చేస్తున్నాం.

– ముజ్జాద వెంకటరమణ, ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్



డిమాండ్లు నెరవేర్చాల్సిందే

- ప్రభుత్వానికి స్పష్టం చేసిన పీహెచ్‌సీ వైద్యులు
- జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ


డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

అరసవల్లి:

గ్రామీణ వైద్యుల సమస్యలు, డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం నెరవేర్చాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు గొంతెత్తారు. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద జిల్లాలోని 71 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు సామూహిక ధర్నా నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. గ్రామీణ పీహెచ్‌సీ వైద్యులకు టైం బౌండ్ ప్రమోషన్లు కల్పించాలని, జీవో 99 రద్దు చేయాలని.. ఇన్‌సర్వీస్ జీపీ కోటాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు 50 శాతం గిరిజన భత్యాన్ని అందించాలని, చంద్రన్న సంచార చికిత్సకు రూ.5 వేలు భత్యంగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘ ప్రతినిధులు డాక్టర్ ప్రతిష్ఠా శర్మ, సుధీర్, పావని, సుమప్రియ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో 73 మంది వైద్యుల నియామకం

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె నేపథ్యంలో ప్రజారోగ్య సేవలకు అంతరాయం లేకుండా ఇతర విభాగాల నుంచి వైద్యులను డిప్యుటేషన్ ప్రాతిపదికను నియమించేలా అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత ఆధ్వర్యంలో 73 మంది వైద్యులను పీహెచ్‌సీల్లో ప్రత్యామ్నాయ ప్రాతిపదికన నియామకాలు పూర్తి చేశారు. బుధవారం నుంచే వీరంతా విధుల్లోకి వెళ్లాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. రిమ్స్ (జనరల్ ఆసుపత్రి)లో పనిచేస్తున్న 33 మంది వైద్యులతో పాటు డీసీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా ఆసుపత్రి (టెక్కలి), ఏరియా ఆసుపత్రి (నరసన్నపేట), కమ్యూనిటి ఆసుపత్రులకు చెందిన 40 మంది వైద్యులకు పీహెచ్‌సీల బాధ్యతలు అప్పగించారు. కాగా, సుదూర ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీలకు తమను పంపించడంపై పలువురు వైద్యులు మండిపడుతున్నారు.


కొత్తగా నియమితులైన వైద్యులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో అనిత

చర్యలు తప్పవు..

ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యులంతా సమ్మెలో ఉన్నందున ప్రత్యామ్నాయంగా 73 మందిని నియమించి డ్యూటి చార్ట్ కేటాయించామని చెప్పారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. వివిధ ప్రోగ్రాంలకు ఇన్‌చార్జి ఆఫీసర్లుగా ఉన్న మెడికల్ ఆఫీసర్లు ఎవరైనా సమ్మెకు దిగితే కఠిన చర్యలు తప్పవు.

రోడ్డు ప్రమాదంలో సీమేన్ మృతి

నరసన్నపేట: మండలంలోని జమ్ము కూడలి సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంబాల రవి (35) మృతి చెందారు. విశాఖ నుంచి తాతయ్య ఊరు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనా స్థలంలోనే రవి మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న రవి దసరా పండగను కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపేందుకు వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. రవికి భార్య భారతి, తలిదండ్రులు నరసయ్య, కామాక్షమ్మ ఉన్నారు. నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రవి(ఫైల్)


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యవర్గం ఏర్పాటు



సాఫ్ట్‌బాల్ కార్యవర్గం

బొబ్బిలి: సాఫ్ట్‌బాల్ జిల్లా కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పరిశీలకులు ఎంవీ రమణ, తిరుపతిరావుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎమ్మెల్యే బేబీనాయన, ఐ.విజయకుమార్, కోశాధికారిగా ఎస్.వెంకటినాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సుంకరి సాయిరమేష్‌లను ఎన్నుకున్నారు.

డివైడర్‌ను ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి జాతీయ రహదారిపై డివైడర్‌ను బైక్‌తో ఢీకొన్న భార్యాభర్తలు గాయాలపాలయ్యారు. బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళానికి చెందిన భార్యాభర్తలు బైక్‌పై విశాఖపట్నం బయల్దేరారు. మార్గం మధ్యలో పోలిపల్లి చేరుకునరికి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న భర్తకు తీవ్రగాయాలు కాగా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో విజయనగరం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న బీఎస్ఎన్ఎల్ మహిళా ఉద్యోగులు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలలో భాగంగా బుధవారం సంస్థ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వరంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా సంస్థ డీజీఎం దాలినాయుడు మాట్లాడుతూ హుద్‌హుద్ వంటి తుఫాన్‌లు, విపత్కర పరిస్థితుల్లో కేవలం బీఎస్ఎన్ఎల్ మాత్రమే అందరికీ అందుబాటులో నిలిచి అందరి మన్ననలు పొందిందన్నారు. 25 ఏళ్ల ఉత్సవాలలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉండేవిధంగా ఫోర్‌జీ నెట్‌వర్క్, 100జీబీ స్పీడ్‌తో ఇంటర్‌నెట్ సదుపాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో సైతం కొత్తగా టవర్ల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ ర్యాలీ ప్రారంభించి టీటీడీ కల్యాణ మంటపం, లయన్స్‌క్లబ్, కోట జంక్షన్, గురజాడ అప్పారావు రోడ్డు మీదుగా తిరిగి కార్యాలయానికి ర్యాలీ చేరింది.

భూముల రీసర్వేకు సర్వం సిద్ధం

పార్వతీపురం రూరల్: జిల్లాలో దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న భూముల రీసర్వేకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. అక్టోబర్ 3వ తేదీ నుంచి తొలి విడతలో 43 గ్రామాల్లో ఈ బృహత్తర కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 175 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, క్షేత్రస్థాయి సర్వే పనులను 60 రోజుల్లో ముగించేందుకు వివిధ సర్వే బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, రైతులకు అత్యంత ప్రయోజనకరంగా మార్చేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గ్రామ సర్వేయర్, వీఆర్‌ఓలు ఒక బృందంగా ఏర్పడి రైతులకు సమాచారాన్ని చేరవేస్తారని, సర్వే నంబర్ల వారీగా రోజువారీ షెడ్యూల్‌ను ముందుగానే రూపొందించి, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించడంతో పాటు, వాట్సాప్ గ్రూపులు, టామ్-టామ్ వంటి మాధ్యమాల ద్వారా ప్రతి భూ యజమానికి తెలియజేస్తారన్నారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించి, రీసర్వే ఉద్దేశం, ప్రయోజనాలను రైతులకు క్షుణ్ణంగా వివరిస్తారన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన (గ్రౌండ్ ట్రూథింగ్) పూర్తయ్యేలోపే అన్ని రకాల మ్యుటేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తారని చెప్పారు. సర్వే అనంతరం భూ యజమానుల విస్తీర్ణ వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే అక్కడికక్కడే స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. ఈ చారిత్రాత్మక అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకుని, తమ భూ రికార్డులను సరిచూసుకోవాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు.

రూటు మార్చిన ఏనుగులు

భామిని: మండలంలోని ఇసుకగూడ-సన్నాయిగూడ సమీపంలోని మెట్టపై మకాం వేసిన ఏనుగుల గుంపు బుధవారం రూటు మార్చింది. దిమ్మిడిజోల-లోవగూడల వైపు నాలుగు ఏనుగుల గుంపు పయనం ఆరంభించింది. దీంతో భామిని వైపు గల గ్రామాల రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే పొలాల్లో పంటలు నిండుగా ఉన్న తరుణంలో ఏనుగులు చేపట్టనున్న పంటల విధ్వంసంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

అర్చకుల ఆర్తనాదం..!

- న్యాయం చేయాలంటూ వేడుకోలు
- దేవదాయ శాఖ భూమిని ఆక్రమించిన టీడీపీ నేత
- పార్టీలకు అతీతంగా గ్రామంలో నిరసన
- పోలీసులు, రెవెన్యూ, దేవదాయ శాఖలకు ఫిర్యాదు



ఆక్రమించిన భూమిని చూపుతున్న గ్రామస్తులు, చిత్రంలో నేలపై దేవాదాయశాఖ బోర్డు

వంగర: మండల పరిధిలోని సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి దేవాలయం పరిధిలో దేవదాయ శాఖ భూమిపై టీడీపీ నేత కన్ను పడింది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇంకెవ్వరు అడ్డు అంటూ గ్రామానికి చెందిన వెలగాడ మోహనరావు సుమారు 80 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నాడు. దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన బోర్డును సైతం లెక్క చేయకుండా భూమిని ఆక్రమించేశాడు. కొన్ని దశాబ్దాలుగా సంగమేశ్వరస్వామి దేవాలయం పురోహితులు(అర్చకులు)గా ఉంటున్న సిద్ధాంతం చిన్నిస్వామి, సిద్ధాంతం పోలిలింగం, సిద్ధాంతం విశ్వనాథం, సిద్ధాంతం నాగభూషణరావులు ఆ భూమిని సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్ని నెలల క్రితం ఈ భూమిని గ్రామానికి చెందిన వెలగాడ మోహనరావు ఆక్రమించుకోవడంతో దేవాదాయ శాఖ ఈవో పొన్నాడ శ్యామలరావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సిద్ధాంతం గణపతిరావు ఆధ్వర్యంలో అర్చకుల బృందం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. అయితే ఆ భూమి వదిలేందుకు ఆక్రమణదారు ముందుకు రాకపోవడంతో బుధవారం గ్రామంలోని ప్రజలంతా పార్టీలకు అతీతంగా ఐక్యమై నిరసన తెలిపారు. ఆక్రమించుకున్న భూమి వద్దకు వెళ్లి కొన్ని దశాబ్దాల నుంచి సంగమేశ్వరస్వామి ఆలయ పురోహితులు అనుభవించే వారని, ఇప్పుడు ఈ భూమి ఎలా దఖలుపడిందని ఆక్రమణదారును ప్రశ్నించారు. అనంతరం గ్రామంలో తిరుగాడుతూ దేవాదాయ శాఖ భూములను రక్షించాలంటూ నినాదాలు చేశారు.



నినాదాలు చేస్తున్న ఇరుపార్టీలకు చెందిన ప్రజలు

దశాబ్దాల నుంచి పురోహితుల ఆధీనంలో..



దశాబ్దాల తరబడి సంగమేశ్వరస్వామి దేవాలయం పురోహితం చేస్తూ సర్వే నంబర్6-3లో 80 సెంట్ల భూమిని నాలుగు కుటుంబాల వారం సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు గ్రామానికి చెందిన వెలగాడ మోహనరావు ఆ భూమి తనకు చెందినదని బెదిరించి ఆక్రమించుకున్నాడు.

సిద్ధాంతం చిన్నిబాబు, అర్చకుడు, సంగాం

ఆక్రమించుకోవడం అన్యాయం..



దేవాదాయ శాఖకు చెందిన భూమిని పురోహితం చేస్తూ మా కుటుంబసభ్యులం అనుభవిస్తున్నాం. అప్పట్లో దేవాదాయ శాఖకు శిస్తు కూడా చెల్లించాం. ఇప్పుడు ఈ భూమిని ఆక్రమించుకోవడం అన్యాయం. మాకు న్యాయం చేయాలి.

సిద్ధాంతం పోలిలింగం, అర్చకుడు, సంగాం

పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించాలి..



అన్యాయంగా భూమిని అక్రమించుకున్న వ్యక్తిపై పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలి. ఆక్రమణదారు వద్ద ఎటువంటి ఆధారం లేకుండా పురోహితులు చేస్తున్న భూమిని అన్యాయంగా ఆక్రమించుకున్నారు.

సిద్ధాంతం గణపతి, ప్రధాన అర్చకుడు, సంగాం

దౌర్జన్యంగా ఆక్రమణ..



దేవాదాయ శాఖకు చెందిన భూమిని టీడీపీ నేత దారుణంగా ఆక్రమించకున్నాడు. దశాబ్దాల కాలం నుంచి ఈ భూమి సంగమేశ్వరస్వామి ఆలయం పురోహితులు సాగుచేసుకుంటున్నారు. ఆ భూమి ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. అటువంటి భూమిని ఆక్రమించుకోవడం దారుణం. దర్యాప్తు చేసి దేవాదాయ శాఖ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

గేదెల రామకృష్ణ, గ్రామపెద్ద, సంగాం

పోలీసులకు ఫిర్యాదు చేశాం..

సంగమేశ్వరస్వామి ఆలయం పరిధిలో ఉన్న దేవాదాయ శాఖకు చెందిన సర్వే నంబర్ 6-3లో 80 సెంట్ల భూమి గ్రామానికి చెందిన వెలగాడ మోహనరావు ఆక్రమించుకున్నట్లు వంగర పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇటు రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేశాం. భూమి ఆక్రమణ వాస్తవమే.

పొన్నాడ శ్యామలరావు, ఈవో, సంగాం

వేగావతి నదిలో భవానీ భక్తుడు గల్లంతు



యోగీశ్వర్రావు (ఫైల్)



మృతదేహం కోసం గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

బొబ్బిలి రూరల్: మండలంలోని జె.రంగరాయపురం వద్ద వేగావతి నదిలో స్నానానికి దిగిన పాటోజు యోగీశ్వర్రావు(22) అనే భవాని భక్తుడు బుధవారం గల్లంతయ్యాడు.బొబ్బిలి పట్టణంలోని కంచరవీధికి చెందిన యోగీశ్వర్రావు సహచర ఐదుగురు భవానీ భక్తులతో కలిసి బుధవారం వేగావతి నదిలో స్నానమాచరించేందుకు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దిగారు. నదిలో నీటి ప్రవాహ ఉధృతి ఒక్కసారిగా పెరిగిపోవడంతో ప్రమాదవశాత్తు ముగ్గురు భక్తులు కొట్టుకుపోగా వారిలో వినయ్, చరణ్‌లు చెట్లపొదల్లో చిక్కుకుని ప్రాణాలతో క్షేమంగా బయటపడగా, యోగీశ్వర్రావు నదిలో కొట్టుకుపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్సై కొండల రావు, ఫైర్ స్టేషన్ హెచ్‌సీబాలకృష్ణ ఆధ్వర్యంలో నలుగురు ఫైర్ సిబ్బంది నదిలో తెప్పల సహాయంతో సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు.అయినా మృతదేహం లభ్యం కాలేదు. యోగీశ్వర్రావు పట్టణంలో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తు కుటుంబానికి అండగా ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వీరాచారి, సుజాత, తమ్ముడు శ్యాంలు నదివద్దకు చేరుకుని బావురుమాన్నారు. మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఏఎస్సై కొండలరావు విలేకరులకు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతిచెందిన పైడితల్లి

విజయనగరం క్రైమ్: నగరంలోని హుకుంపేటకు చెందిన పైడితల్లి(50) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు విజయనగరం టూటౌన్ ఏఎస్సై రామారావు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పైడితల్లికి ఇద్దరు భార్యలు. మొదటి భార్యతో విడాకులు తీసుకుని రెండో భార్యతో నివసిస్తున్నాడు. సైకిల్ టైర్ పంక్చర్ రిపేర్ తో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజులాగానే పనిలోకి వెళ్లిన పైడితల్లికి అక్కడే కరెంట్ షాక్ తగలడంతో మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య మంగ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే

నెల్లిమర్ల రూరల్: ఏళ్ల కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి జరిపిస్తున్న రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ శ్రీకాంత్ కోరారు. మండలంలోని అలుగోలు సచివాలయంలో భూముల రీసర్వేపై బుధవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి అలుగోలులో సుమారు 2,200 ఎకరాల్లో భూముల రీసర్వే ప్రారంభిస్తున్నామని, రైతులు సంబంధిత పత్రాలను సర్వే సిబ్బందికి చూపించి సహకరించాలన్నారు. రీసర్వేతో రైతుల భూ విస్తీర్ణం, హద్దులు, తదితర సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు.

అడ్మిషన్లకు 'పెన్' చాలు



విద్యాశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర రెడ్డి

- కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఉన్నత విద్య అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేస్తూ కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. డిగ్రీ వంటి కోర్సుల్లో చేరేందుకు ఇకపై విద్యార్థులు ఎలాంటి సర్టిఫికెట్లు సమర్పించాల్సిన అవసరం లేదని, కేవలం అపార్ ఐడీ, పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) ఉంటే సరిపోతుందని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఏ ఒక్క విద్యార్థి డిగ్రీకి దూరం కాకూడదన్నారు. బడి మానేసిన, 10వ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి తిరిగి చేర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, గార్మెంట్ టెక్నాలజీలో శిక్షణతో పాటు, ప్రతిరోజూ యోగా, హెచ్‌బీ స్థాయి పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలైన చదవడం, రాయడం తప్పనిసరిగా వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఈఓ రాజకుమార్, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతన్నకు జీఎస్టీ 2.0తో ఊరట

వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) 2.0సంస్కరణలు రైతాంగానికి ఎంతో మేలు చేకూర్చనున్నాయని కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు. ఈ పన్ను తగ్గింపు ప్రయోజనాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌తో కలిసి జీఎస్టీ 2.0 అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జీఎస్టీ నోడల్ ఆఫీసర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల జీడిపిక్కలతో కాంటాక్ట్ డెర్మటైటిస్



నల్లజీడి పిక్క రసం వల్ల వచ్చే దద్దుర్లు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంతో పాటు, జిల్లాలో కూడా దసరా పండగ రోజు నల్ల జీడిపిక్కలు వాహనాలు, తలుపులు, ద్వారాలపై వేలాడదీస్తూ అవి చెడు కన్ను నుంచి రక్షిస్తాయని ప్రజలు నమ్ముతారని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డెర్మాటాలజీ హెచ్‌వోడీ డాక్టర్ కె.వెంకటచలం తెలిపారు. నల్ల జీడిపిక్కల్లో శక్తివంతమైన రెసిన్లు, అనకార్డిక్ ఆమ్లం, ఉరుషియోల్ ఉన్నాయని తెలిపారు. ఇది కఠినమైన అలర్జీ చికాకు కల్గించే కాంటాక్ట్ డెర్మటైటిస్‌కు కారణమవుతుందన్నారు. దసరా తర్వాత చాలా మంది ఈ డెర్మటైటిస్‌కు బాధితులు అవుతారన్నారు. దద్దర్లు చాలా అసౌకర్యంగా ఉంటాయని, చాలా కుటుంబాలు చాలా ఆలస్యం అయ్యేవరకు దీన్ని గుర్తించరన్నారు. ఈ దద్దుర్లు సాధారణంగా ముఖం, చేతులు, మెడపై తీవ్రమైన ఎరుపు వాపుగా కనిపిస్తాయన్నారు. తీవ్రమైన సందర్భాల్లో ఎర్రటి చారలకు దారితీస్తుందని తెలిపారు. నల్ల జీడిపిక్కలతో సంబంధం ఉన్న వారు తమ చేతులను, ప్రభావిత ప్రాంతాలను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు.

పైడితల్లి అమ్మవారి ప్రసాదాల నాణ్యత పరిశీలన



ప్రసాదాల తయారీకి వాడే ఆహార పదార్థాల రా మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జాతరకు వినియోగిస్తున్న ప్రసాదాల నాణ్యత తీరును ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు బుధవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి మాట్లాడుతూ అమ్మవారి పండగకు సంబంధించి తయారు చేసే లడ్డు, పులిహోర ప్రసాదాలకు సంబంధించిన ఆహారపదార్థాల నాణ్యతను ప్రతిరోజూ చెక్ చేస్తున్నామన్నారు. అందుకు సంబంధించిన శాంపిల్స్‌ను సేకరించామని, వాటిని హైదరాబాద్‌లోని నాచారంలో ఉన్న ఫుడ్ లేబొరేటరీకి పంపిస్తామన్నారు. ప్రసాదాలకు వినియోగించే కందిపప్పు, శనగపప్పు, కాజూ, నెయ్యి తదితర వాటిని చెక్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ నాగుల్ మీరా, ఆలయ సూపర్‌వైజర్ రమేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లేటెస్ట్ టెక్నాలజీని వినియోగించాలి

- ఎస్పీ దామోదర్



పెదమానాపురం పీఎస్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: స్మార్ట్ పోలీసింగ్ ప్రతి పోలీస్ స్టేషన్ లో ఉండాలని ఎస్పీ దామోదర్ అన్నారు. సీఎం చంద్రబాబు పర్యటన బుధవారం ముగిసిన వెంటనే పెదమానాపురం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషను పరిసరాలు పరిశీలించి, స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. స్టేషన్ కు వచ్చే బాధితులు, వృద్ధులు, మహిళల పట్ల అప్యాయంగా మాట్లాడి, వారి సమస్యలను ఓపికగా విని, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులపట్ల సామరస్యంగా, నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసు సిబ్బందిని, అధికారులను ఎస్పీ ఆదేశించారు. స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలందించాలని, అందుకు టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించి నేరాలకు పాల్పడే వారిని, గంజాయి, మహిళలు పట్ల దాడులకు పాల్పడే వారిని, బాలలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు.

మహిళల ఆర్థికస్వావలంబన పెంపుదలే లక్ష్యం

- సెర్ప్ సీఈఓ కరుణ



డ్వాక్రా, సరస్ ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారిణి వాకాటి కరుణ

విజయనగరం టౌన్: మహిళల్లో ఆర్థికస్వావలంబన పెంపొందించడమే లక్ష్యంగా అఖిలభారత డ్వాక్రా బజార్, సరస్‌ను ఏర్పాటుచేశామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వాకాటి కరుణ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన డ్వాక్రాబజార్, సరస్ ఎగ్జిబిషన్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్వయం సహాయక సంఘ సభ్యులు ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించి, వారితో మమేకమయ్యారు. మహిళల సృజనాత్మకత, శ్రమ, నైపుణ్యాలను ప్రోత్సహించే దిశగా ఇటువంటి కార్యక్రమాలు రూపకల్పన చేశామన్నారు. ఎన్నోరకాల తయారీ ఉత్పత్తులు ప్రదర్శనలో అందుబాటులో ఉంచడం అభినందనీయని ప్రశంసించారు. కార్యక్రమంలో సెర్ప్ హెచ్‌ఆర్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి, స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్, వెలుగు ఏపీడీ సావిత్రి, పీడీ రత్నాకర్, సరస్ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, డీపీఎంలు రాజ్‌కుమార్, చిరంజీవి, లక్ష్మునాయుడు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధితో వ్యక్తి మృతి

- భయభ్రాంతులకు గురవుతున్న గ్రామస్తులు
- కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



లింగంనాయుడు(ఫైల్)

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందిన అదపాక లింగంనాయుడు(37) రేబిస్ వ్యాధితో సోమవారం మృతిచెందాడు. ఆయనకు ఆగస్టు 30న కుక్క కరవడంతో సంతకవిటి పీహెచ్‌సీకి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకున్నాడు. ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో శనివారం శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లగా రేబిస్ వ్యాధి సోకినట్లు వైద్యులు గుర్తించి, మెరుగైన చికిత్స కోసం వైజాగ్ రిఫర్ చేయడంతో ఆదివారం వైజాగ్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈయన మృతితో గ్రామస్తులు భయాందోళన చెంది గ్రామంలో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



కార్యకర్తలతో కలిసి పౌష్టికాహారానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ పైడినాయుడు

భోగాపురం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, అలాగే రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమ అన్నారు. మండలంలోని రావాడ గ్రామంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను వివరించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారానికి సంబంధించి ఏర్పాటు స్టాల్స్‌ను సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు పరిశీలించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి పౌష్టికాహార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు మనస్వీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏనుగులు ధ్వంసం చేసిన పంట పరిహారం కోసం ఆందోళన



కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం రూరల్:

ఏనుగుల గుంపు సృష్టిస్తున్న బీభత్సానికి తమ పంటలు సర్వనాశనమయ్యాయని, తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, గిరిజన సంక్షేమ సంఘం నేతృత్వంలో బుధవారం నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కేవలం 5 కిలోమీటర్ల దూరంలోని మరికి, కృష్ణపల్లి తదితర గ్రామాల సమీపంలో 8 రోజులుగా ఏనుగులు సంచరిస్తూ సుమారు 50 ఎకరాల్లో మొక్కజొన్న, వరి, టేకు చెట్లను ధ్వంసం చేశాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కనీసం నష్టాన్ని అంచనా వేయడానికి కూడా రాలేదని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా సభ్యుడు పి. సంగం, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన నష్టానికి ఇప్పటికీ పరిహారం చెల్లించలేదని, అరకొర సాయం అందించి అధికారులు చేతులుదులుపుకుంటున్నారని, పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి న్యాయమైన పరిహారం చెల్లించాలని, అలాగే ఏనుగులను సురక్షిత ప్రాంతాలకు తరలించి రైతులు, ప్రజల ప్రాణాలకు, పంటలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఏనుగులు సంచరిస్తున్న గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారాన్ని త్వరగా అందించేలా చర్యలు

ఏనుగులు ధ్వంసం చేసిన పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారాన్ని సత్వరమే అందజేయాలని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి డీఎఫ్‌ఓ జీపీపీ ప్రసూనను ఆదేశించారు. పార్వతీపురం మండలం మరికి, కృష్ణపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఏనుగుల గుంపు తమ పంట పొలాల్లోకి చొరబడి తాము సాగుచేసుకుంటున్న పంటలను ధ్వంసం చేస్తున్నాయని బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కావున నష్టపోయిన పంటలకు గాను సంబంధిత రైతులు, కౌలు రైతులకు తగిన నష్టపరిహారాన్ని అందించి తమను ఆదుకోవాలని కలెక్టరుకు దరఖాస్తు అందజేశారు. ఈ దరఖాస్తు పరిశీలించిన కలెక్టర్ వెంటనే స్పందించి, జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అందజేయాలని, అలాగే నష్టపోయిన గిరిజన రైతులకు త్వరగా నష్టపరిహారం అందించే దిశగా సత్వర చర్యలు చేపట్టాలని డీఎఫ్‌ఓ జీపీపీ పి.ప్రసూనను ఆదేశించారు. దీంతో రైతులు తమ ఆనందం వ్యక్తం చేశారు.



మొక్కజొన్న రైతులు, సీపీఐ, గిరిజన సంఘం నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి